# తోడేళ్ళ గుంపు



చావా శివకోటి

భూదేవి ఇటుక మోసే పని ముగిశాక గుడిసేపు నడిచింది.

పొద్దు మసకబారుతున్నది.

పోరి గుడిసెన గుక్కపట్టి ఏడుస్తుంటది. బేగి చేరాల! అనుకుంటూ నడక వేగం పెంచింది. నడుస్తున్న తోవ వెనక్కి జరుగుతున్నది. ఉసిగ నడవడాన ఆరిన చెమట మళ్లీ చిగుర్చింది.

వెనక నుంచి వచ్చిన సైకిలు ఎదురుగా ఆగింది.

చికాకున తలెత్తింది. మేస్త్రీ చుక్కయ్య. సైకిలు స్టాండేసి ఆగమన్నట్టుగ చూస్తూ, "ఏందా పరుగు?" అన్నాడు. వాడి మొఖాన మొలక నవ్వు కనపడ్డది. దానిలో తోడేలు తత్వం లీలగా కనపడ్డది.

"పసి పోరి పాలకు ఎంపర్లాడుతుంటది. పొద్దుననగ వస్తిం గద! ముసల్ది ఇంట్లో లేదు. ఇంటోడు గుడిసె కెప్పుడొస్తాడో వానికే తెలీదు. పోవాల!" అని సైకిలుకు తప్పుకుని నడిచింది.

ఒడుపుగా చెయ్యి పట్టుకున్నాడు చుక్కయ్య.

ఆగింది భూదేవి. 'ఏందిది?' అన్నట్టు చూసింది.

భూదేవి పాలిళ్లు చేపుకున్నాయి. తీపెడుతున్నాయి.

నవ్వాడు చుక్కయ్య. కోరిక కనపడింది.

"నేను ఇటికలు మోసేందుకు వచ్చిన. పని చేసిన. కూలి ఇచ్చినవు! పోరి గుడిసెన గుక్కపడుతుంటది. బేగి పోవాల!" అని చేయి విదిలించుకుని నడిచింది.

చుక్కయ్య మేస్త్రీతనానికి దెబ్బ తగిలింది. మొఖం కందగడ్డ లెఖ్ఖనయింది. "నేనూ వస్తా!" అని సైకిలు స్టాండు తీసి వెంట నడిచాడు.

"గుడిసెదాకా వస్తావా?" అన్నది.

నవ్విండు.

"ఎందుకు?"

"నా మామూలు కావాలి!" అన్నాడు నవ్వుతూనే.

అసలు వీనికి నవ్వెందుకు వస్తున్నదో అంతు చిక్కలేదు. "మామూలేంది?"

"అది తెలీకుండానే పనిలోకొచ్చినవా?"

మాట్లాడక నడిచింది అసహనంగా.

"మాటాడవేంది?" అన్నాడు.

"ఇదిగో, కూలికొచ్చిన. పని చేసిన. కూలి తీసుకున్న. ఇంక మామూలేంది? ఈ వెంటపడుడేంది?"

"నిన్ను పనిలో పెట్టుకున్నందుకు. మరెవర్నైన పెట్టుకోవచ్చు గదా! నేను పనిప్పియ్యబట్టే గద నీకు కూలి వచ్చింది!" అని నవ్వి, "ఇగో, తాపీ మేస్త్రీని నేను. నేను పనిలోకి తీసుకున్నప్పుడల్లా వాని కూలిలో నాకు అయిదు రూపాయలిచ్చిపోతరు. ఏందది? అని ఎవడన్న నోరు మెదిపితే మరో ఆకలి గొడ్డు పనికెక్కుతది. వాని పని పోతది!" అన్నాడు.

వాని మొఖాన అదే చెదరని నవ్వు.

పేదోణ్ణి మరో పేదోడు నిర్దాక్షిణ్యంగా దోచుకోవడం.

పేదోళ్లంతా ఒక్కటే! పేదోళ్ల కులం! అని నోరు చిరిగేలా అరవడం, హితబోధలు చేయడం ఎంత ఫార్సో కళ్లముందు నిలిచింది. ఎక్కడ పట్టు ఉన్నదో అక్కడ దోచుకోవడం లోకం రివాజులా అనిపించింది. పెద్ద కప్ప చిన్నకప్పను తినడం .... వారి అక్కరలకోసం సిద్ధాంతపు కంచెను వేసుకుని భద్రంగా కాచుకోవడం ... నవ్వొచ్చింది అంత బాధలో.

"నువ్వు ఆడ పోరివి. నాతో ఓ పూట ఉండాల!" అన్నాడు 'నీ కండువా ఇయ్యి. పొద్దుటే ఇస్త!' అన్నంత తేలికగా. ఈ మాటనేటప్పుడు కూడా వాడి మొఖాన నవ్వు చెదరకపోవడం వింతగా తోచింది.

ఠక్కున ఆగింది భూదేవి. కళ్లు నిప్పు కణికలయినయి. ఒళ్లు వణికింది.

"నీ పెళ్లాం పనికి వచ్చినా ఇదే రివాజు గద!" అన్నది.

"ఏం కూసినవే?" అని ఉరుముతూ చేయి లేపిండు.

లేచిన చేతిని విసిరిపారేసింది భూదేవి. "ఇగో, ఇంక ఒక్క అడుగు నాతో వేస్తివో, నేనేం జేస్తనో నాకే తెలీదు!" అని విసురుగా నడిచింది.

తెల్లబోయిండు చుక్కయ్య. ఆగిండు. అటు కాలు మాత్రం కదపలేదు.

భూదేవి గుడిసెకు చేరింది. పోరి ఏడుపు గుడిసె నుంచి వినపడ్డది. "నా బిడ్డే ....!" అని ఆరాటంగా పోరిని చేతుల్లోకి తీసుకుని చతికిలపడి రవికె ముడి గుంజి రొమ్మును పోరి నోట కుక్కింది. ఆబగ పాలు చీకుతూ ఏడుపు మానింది. రొమ్మున బుల్లి చేతులు కదులుతున్నాయి. భూదేవి అన్నీ మరచి తృప్తిగా కళ్లు మూసుకుంది.

మనస్సూ, ఒళ్లూ ఎంతో తేలికనిపించింది. తడికకు ఆనుకుని అట్లాగే ఉండిపోయింది.

000

గుడిసెలోనా బయటా చిక్కటి చీకటి.

"ఒసే, భూదేవీ!" అని పిలుస్తూ ఊతకర్రతో గుడిసెలోనకు నడిచింది ముసల్ది.

"కూస్త సీసా వత్తి ఎలిగిస్తే పోయేది గదనే!" అంటూ ఆ చీకటిననే మసక కళ్లతో వెతుకులాట మొదలెట్టింది. సీసా వత్తి చేతికి దొరికింది. దాని పక్కనే అగ్గిపెట్టె ఉంది. వెలిగించింది. ఆదమరచి నిద్రపోతున్న భూదేవీ, పాలు చీకుతూనే నిద్రట్లోకి జారబడ్డ పోరి కనిపించారు. "మాతల్లే!" అని మెటికలిరుచుకుంది ఆనందంగా.

"రుక్కమ్మా!" అని పిలిచారెవరో గుడిసె బయటనుంచి.

ఈ ముసల్దాని పేరే రుక్కమ్మ.

దీని అమ్మా అయ్యలకు ఇంత తినా కుడువా ఉంది కనుక రుక్మిణి అని పేరెట్టుకున్నారు దీనికి. మనువయ్యాక రుక్మిణి, రుక్కమ్మ అయింది. మగడు తాగుబోతుగా మారాక రుక్కమ్మ ఇంకా ఏదేదో అయింది. వాడు తప్పతాగి లారీ కింద పడి చచ్చాక పసిదానితో రోడ్డున పడింది. మగడు లారీకింద పడి చచ్చినందుకుగాను వచ్చిన ఇన్సూరెన్స్ పైకాన్ని వకీలుబాబులు లెక్క దొరక్కుండా వారి న్యాయపు పట్టాన బంధించారు. అనాథలకిచ్చే ఇళ్లచోటు మురిక్కాలవెంట ఇస్తే, ఆడ తడికల గుడిసె వేసుకునేందుకు మాత్రం ఆ వకీలు బాబు సాయం చేసిండు. అది మొదలు రుక్కమ్మ లోగిలి ఇదే!

ఒంట్లో సత్తువ పూరా తరిగిందాకా అడపా దడపా కూలీ పనికి పోతూ పాచి పనులు చేసింది. కన్నపోరి భూదేవి పెరిగింది. రామదాసుకిచ్చి ముడెట్టింది బతిమాలి. మొలతాడు కొనుక్కోలేని మగపోరడైనా, అదో ఇదో ఇమ్మంటడు గదా!

ఈలోపు చూపు తగ్గింది. ఇక పని ముఖానికెళ్లలేననుకుని అరవ హోటలు మూలన కూర్చుని అడుక్కోవడం ప్రారంభించింది. నాల్గయిదు దినాలయినాక ఓ ముసలోడు రుక్కమ్మ దగ్గరకొచ్చి

"ఈ చోటు నాది! నువ్వీడ కూకున్నావేం? రేపట్నుంచి రామాకు!" అన్నాడు.

'అదేంది? ఈ మాట హోటలాయన అనాల. కిళ్లీ కొట్టాయన అనాల. పోలీసోళ్లనాల. మున్సిపాలిటీవోళ్లు అనాలి ఈ డంటడేంది?' అనిపించి, "అసలు నువ్వెవరు?" అని అడిగింది.

'ఇదేం తెల్లమొఖం మాట?' అన్నట్టుగ నవ్విండు. వాడి నవ్వు బాగుంది. వయసప్పుడు ఇంకా బాగుండి ఉంటుంది.

అట్టానే సూసింది ముసలోడేపు.

"అడుక్కోలే, కానీ నాకు రోజా సగం ఇవ్వు!" అన్నాడు.

"అదేంది?" అంది తెల్లబోయి.

"అది నీకు తెలీదులే గానీ, ఇవ్వాల!" అని ఎల్లిపోయిండు నవ్వుకుంట.


ఆ రోజు మొదలు ఆరేళ్లుగా ఇస్తానే ఉన్నది. ఈపొద్దు ముసలోడికోసం చూసింది. రాలేదు. గుడిసెకొచ్చింది. పైకం కోసం వచ్చాడన్నమాట అనుకుంది. బయటుకు తెచ్చి, రెండు సగాల చిల్లరలో ఒకటిచ్చింది.

"ఆలస్యమైంది రుక్కీ! లారీ సెంటర్లో కూర్చునే ముసలోడు చచ్చిపోయిండు. కూచున్నప్పుడు బాగానే ఉన్నాడు మాపటేళ్లకు ముందే ఊపిరి వదిలినట్టుంది. ఈగలు బాగా ముసిరినయి. చందాలు ఏసుకోని వాడ్ని మట్ల గలిపేసరికి వేళ తప్పింది!" అంటూ నడిచాడు.

బతికినంతకాలం సగం వాటాలంటూ, చచ్చాక కూడా బిచ్చమే అడిగి పూడ్చాడా? తోటి పేదోడు గదా!

రుక్కమ్మకు నవ్వొచ్చింది. దాని వేనకాతల దాక్కుని ఉండే అంతుమాలిన దుఃఖం ఎగతట్టింది. కళ్లు నీళ్లకుండలయినాయి. ఇదేం లోకం? ఈ తీరేంది? అసలీళ్లు మనుషులేనా? అనేది అర్థం కాలేదు.

కాఫీలు అవీ వద్దు. మమ్మల్ని వినోద పర్యాలని ప్రయత్నించకండి.
ఇలా వచ్చి కూర్చొని సరదాగా కబుర్లు చెప్పండి చాలు.



కళ్లు తుడుచుకుంటూ గుడిసె లోనకు నడిచింది.

000

రామదాసు తూలుతూ వచ్చాడు. గుడిసె తమదేనని గమనించడానికి కొస్త టైం పట్టింది. నిలదొక్కుకుని, ఆగి నాల్గువైపులా చూశాక కానీ అర్థం కాలేదు.

"ఏం తాగుడురా నీ బతుకు చెడ!" అన్నది రుక్కమ్మ రామదాసు వాలకం చూసి.

"అసేయ్! ముసలీ! నేను రోజా పనికి పోతన్న గదా! మరి పని అయినంక ఒళ్లు పులుస్తది గదే! గది తగ్గాలంటే తాగక తప్పదు గదనే!" అన్నాడు పెద్దగా నవ్వి. పనికి, తాగుడికీ ఉన్న అవినాభావ సంబంధాన్ని విశదీకరించి.

"మేం ఊర్కే తొంగుంటున్నామా?" అంది చికాకుగా మొఖం పెట్టి.

"నేను తాగంది ఉండలేనే! నిద్రా పట్టదు! అని ఆగి, "ఓసే ముసల్దానా! నేను గోదాం హమాలీ పనిని పదేలకు కొనుక్కున్న గదా! అంటే ఆడ పనిపైన హక్కు మాదే గదా! మాకంటే ఎంత పనోడొచ్చినా, పేదోడొచ్చినా పనికి రానియ్యం గద! ఏందిరా అని ఎవడన్నా నోరు మెదిపితే, సంఘం అంటం గద! సంఘం అంటే దాంట్లో ఉన్నోళ్ల బాగు కోసమేనే! మిగిలినోళ్లు ఎట్టా చచ్చినా మా కేం లేదు. బేఫికరుగ ఉంటం!" అని అదోలా నవ్వి.

"ముసల్దానా! ఈ పొద్దు ఒకడు పెద్ద సంసారంతో గోదాం చెట్టుకిందకొచ్చినాడే. వాడితాన భత్యం ఉన్నట్టుగ లేదు. సైంగ, వాడొచ్చి మా మేస్త్రీనడిగిండు 'నేనూ, మా ఆవిడా పనికొస్తం' అని. నిజానికివ్వాళ ఇద్దరు మా వోళ్లు పనికి రాలేదు. 'అడ్డాలో ఇచ్చే కట్టుకూలిద్దాం, తీసుకోరాదు' అన్నాను నేను. లేదన్నాడు మేస్త్రీ. మాకు ఈ పొద్దు తలా ఇన్నూరు రూపాయిలొచ్చినయి. వందకంటే ఇంటికాడ ఏం జేస్తమే అనుకుని తప్పతాగినది తప్ప, వాని కుటుంబానికి పావలా ఇయ్యలేదే!" అని బాధపడి, "ముసలీ! ఈడ గుడిసెలు పక్కపక్కనే ఏసుకుని ఉంటున్నం గద. అంతా పేదోళ్లమే గద. ఒకరికొకరు కష్టాన ఆదుకోనకుంటే ఇట్టా ఉండటమెందుకే? ఛ! ఏం మనుషులే వీళ్లు!" అని గుడిసెకు రాక, వెనక్కి తిరిగిండు.

"మళ్లా ఏడికిరా! ఇంకా తాగుతావా ఏందిరా?" అంది లేచి అడ్డుపడబోతూ.

"ఆగు. బాధున్నదే! గుండె పగుల్తన్నది. అసలు పదేలు పెట్టి పని కొనుక్కోడమే తప్పు గదనే! పైసలుంటే వాడూ కూనుక్కుంటడు గద. లెవ్వు గనక పని కూడా దొరకనివ్వం గద!" అని తోవపైనే చతికిలపడి ఏడ్సిండు.

"ఓరి నీ తెలివి తెల్లార! పది వేలు కట్టి వానికి పనిస్తావురా! తెగ ఇదవుతున్నవు. ఆడ జేరకమునుపు నీ గతి కానినోడెవడురా? ఛ! ఊర్కో!" అన్నది.

"అట్టంటలేదే! ఇది న్యాయం కాదు గదనే. వాడూ పేదోడే గద! మన్ని పీక్కుని తినేటోడు గాదు గద. వాణ్ణి కూడా చూడకపోతే ఛ....ఛ...!" అని పల్లు పటపట కొరికిండు.

'దీన్నయినా లేపితే, వాణ్ణి లోనకు తీసుకొస్తది!' అనుకుని గుడిసెలోకి నడిచింది రుక్కమ్మ.

ముసల్దాని వెంటనే లోనకొచ్చిండు రామదాసు. వాణ్ణి చూసి కుదుటపడ్డది ముసల్ది.

రామదాసు నిద్రపోతున్న పసిదాన్ని చేతుల్లోకి తీసుకుని ముద్దెట్టుకుంటూ బయటకొచ్చిండు. కేర్ మని ఏడుస్తూ సారా కంపుకు ఉక్కిరి బిక్కిరి అయిపోయింది పోరి.

భూదేవి విసురుగా వచ్చి పోరిని గుంజుకుని,

"మురికి కంపును తోసేసేంత సారా కంపుతో ముద్దెట్టుకుంటే .... ఛ, అసలు మనిషివేనా!" అంటూ రొద్దెక్కింది భుజాన వేసుకుని జొజ్జర కొడుతూ.

"ఇంత దూరం సారా కంపు కొడతంటే పసిపోరితో ముద్దేటిరా, నీ జిమ్మడ! నీకు కాలం రాకుండా పోయింది మా ఖర్మకు!" అని ముక్కు చీదింది ముసల్ది.

000

పొద్దు పొడిచింది అప్పుడే.

రామదాసు సారా కంపు తరిగి, మురుగు కాలువ వాసన గుడిసెని కమ్ముకుంది.

భూదేవి లేచింది. ఒళ్లు విరుచుకుంటూ పక్కన చూసింది. రామదాసు లేడు. ఎప్పుడెల్లాడో అర్థమూ కాలేదు. పోరి మంచి నిద్రకున్నది.

"రుక్కీ!" అని పిలిచారెవరో.

"ఈడనే ఉన్న!" అంటూ పక్క గుడిసె తడిక దగ్గర నుంచి పలికింది.

భీమవరం రంగడూ, వాడి చెమ్చా కనపడ్డారు.

"ఏందిరా! మీకూ అప్పుడే పొద్దు పొడిచినాదిర!" అంది నవ్వి.

"మూడు నెలలాయె. మామూలియ్యక పోతివి!" అన్నాడు రంగడు.

"అద్దె అనరా! మామూలంటావేంది?" అంది కోపంగా ఉంటున్న గుడిసెలకు మునిసిపాలిటీ వాళ్లు అద్దె అడగడంలేదు. పట్టా ఇచ్చినోళ్లు అడగడంలేదు.

ఈ భీమవరం రంగడు మాత్రం తీసుకుంటనే ఉన్నడు. వానికో పేద ప్రజల పార్టీ అండ ఉంది. వాణ్ణి కాదంటే పోలీసులు... కేసులు. పంచాయితీలు .... బొచ్చె బోలెతో రోడ్డున పడటం.

రెక్కాడితో గానీ డొక్కాడని ఈ గుడిసెలోళ్లు వానితో పెట్టుకోలేరు గద! గుడిసెలోపలకెల్లి చిల్లర తెచ్చి, లెక్కట్టి వాడి చేతిలో పోసింది.

"ఓ పూట ఆలస్యమైనా నీ ఇసయమే వేరే!" అంటూ నడిచిండు రంగడు.

000

అడుక్కునే అడ్డాకు పోయేందుకు ఆలస్యమైపోతున్నదని గుడిసెకు తడికేసి వెనక్కి మల్లింది రుక్కమ్మ.


"నేను ... కొమరాన్ని!" అన్నాడు ఎదురొచ్చి.

"ఆఁ...ఆఁ ...!" అని తేరిపార జూచింది.

ఈ కొమరం గుడిసె పక్కనున్న మురికి కాల్వలోని చెత్తా, మట్టీ తీసేటోడు. మున్సిపాలిటీవోడు. వానికి నెలకు నాల్గు రూపాయలివ్వాల. బలవంతమేం లేదు. ఇవ్వకున్నా పోతడు. కానీ, వాడెత్తిన చెత్త, మురుగునంతా ఈ గుడిసె ఎనకనే ఆపుతాడు. నిల్వ ఉంచుతాడు. అది అక్కడ ఉన్నంతకాలం ఊపిరి సలపదు. ఉండలేం! అయినా వీడే నయం అనుకుని, "రేపిస్తాలే. ఈ పొద్దు లెవ్వు!" అన్నది.

"రేపిటేపు రాను. ఎల్లుండి వస్త. మళ్ల వాయిదా పెట్టకు, ఆఁ!" అని నడిచాడు.

నెమ్మదిగా బాటన పడింది రుక్కమ్మ.



000

ముసలయ్యొచ్చిండు పైకం కోసం. వాని సగం వానికి రావాలి గద!

"ఇయ్యాళ నీకు సగం వాటా ఇవ్వ!" అంది రుక్కమ్మ ముసలయ్యను చూస్తూ.

"దీనికి పోతపాలు పడ్డయి!" అనుకుని నవ్విండు కానీ కదలలేదు.

"ఈడ కష్టం జేసెడిది నేను! నీకు సగం ..." అని ఆగింది.

"అదే .... నాకెందుకియ్యాల అనేది నీకు తెలియాలి గద. చెప్త ఇగో ..... ఇక్కడ నిన్ను అడుక్కోనిచ్చినందుకు నా కియ్యాల. నువ్వు అడుక్కుంటున్న ఈ చోటుకు మరొకడ్ని రానీయకుండ చూస్తున్నందుకు ఇయ్యాల. ఈ వార్డు కౌన్సిలరుకు, పదో పరకో ఇచ్చి నీ జోలికి రాకుండ చూసినందకు ఇయ్యాల! టౌన్ ఎస్.ఐ.కి, పోలీసులకూ ఏదో ఇచ్చి ఆపినందుకు ఇయ్యాల. వాళ్లకు నేను నెలవారీ చూసుకుంటూంటే, నీ సీటు పదిలంగా ఉంటది. ఇది ఎక్కడ బెడిసినా, నువ్విక్కడ ఉండవు!" అని నవ్వి, "రుక్కీ! హక్కు ఒకడిచ్చడిది గాదే! స్వంతం చేసుకునేడిది. కఱ్ఱ ఉన్నోడిదే బఱ్ఱె. అని మనోళ్లు అనంగ ఇనలేదే?" అని, "ఇగో, ఈ రాజకీయాలోళ్ల లెఖ్ఖ పని అయిందాకా లొల్లిజేసేటోడ్ని గాదు నేను. ఏదో పనిచేయలేవు, బతుకుతవు అని జాలిపడిన. ఇట్ల అంటవనుకోలేదు. శ్రమ, దోపిడీ అని చెవిగోసిన మేకలా అరిసేటందుకు నేను ఎఱ్ఱ చొక్కావోడ్ని కాదు. వాడి నాభం వానికున్నది. అందుకే వదలక పాత రికార్డులా అరుస్తనే ఉంటడు. వాడు బాగుపడతడు!" అని పెద్దగ నవ్వి, "ఇక తీసి ఇచ్చెయ్ నా సగం!" అన్నాడు.

తెరచిన నోరు ఈగలు దూరినా మూతబడనేదు రుక్కమ్మకు.

'అసలు దీని వంట్లో గాలిగానీ పోలేదు గదా!' అని అనుమానమొచ్చి కదిపిండు ముసలయ్య.

"ఆఁ...ఆఁ...!" అంటూ ఈ లోకానికొచ్చింది.

"క్రిష్ణ పరమాత్ముడు నోరు తెరిచి వాళ్లమ్మకు అంతా చూపిండట. నువ్వు నోరు తెరిచి ఏం చూస్తున్నవ్?" అని నవ్విండు.

వీడి నవ్వు పాడుగానూ, ఎంత ముచ్చటగుంటదో అనుకున్నది రుక్కమ్మ అన్నీ మరిచి. ఒక్కటిగా చేసిన పైసల్ని మళ్లీ విడగొట్టింది. వానియి వానికిచ్చింది.

బతుకు తీరు చెప్పంగనే తెల్సుకున్నది. తెలివున్న ముండే! అనుకుంటూ నడిచిండు ముసలయ్య.

అడుక్కోవడం ఆపి, పట్టా తీసి చెట్టు తొర్రన కుక్కి, గుడిసేపు బయలుదేరింది రుక్కమ్మ.

ముసలోడికి పంచిచ్చినాక అడుక్కోవడం ఔ'ధర్మమవుతుందని దానికి తెల్సు.

000

భూదేవి పనికోసం బయలుదేరింది. అడ్డాన నిలబడ్డది.

ఓ ముసలి మేస్త్రీ పనికి రమ్మన్నాడు. వాణ్ణి పరిశీలనగా చూసింది. ఏ వికారాలూ పనిచేసే వయుస్సు కాదనిపించింది. ధైర్యంగా వెళ్లింది. పని చేసింది. మాపటేళ అందరితోపాటు తనూ కూలీ తీసుకున్నది.

బాగానే ఉందనుకున్నది. నాల్గురోజులు గడచినయి. అయిదోనాడు కూలి ఇచ్చినంక,

"ఇగో, నీ పేరేటన్నవు?" అని పిలిచినాడు మేస్త్రీ.

చెప్పింది.

"ఏడ ఉంటవు? పొరుగూరి నుంచి వస్తన్నవా?"

"ఈడనే ఉంట. గుడిసె ఉన్నది!" అంది.

"ఇట్రా!" అన్నాడు.

ఇంకొంచెం దగ్గరకొచ్చింది.

"ఈ ఇల్లు కట్టించేటాయున నిన్న ఈడికొచ్చిండు. చూసినవా?" అడిగిండు.

"నేనా? చూడలే!"

"ఆహాఁ!"

"నేనెందుకు చూడాల?" అడిగింది అనుమానంతో.

"నిన్ను చూసిండులే!" అన్నాడు నవ్వి.

మాటాడలేదు భూదేవి. "ఇక పోత!" అని నడవబోయింది.

"ఆగు, ఒక మాట ఇని పో!" అన్నాడు.

ఆగింది మేస్త్రీవైపు మళ్లకుండానే.

"నీ కూలిగాక రోజుకో వంద అదనంగ ఇస్తడు. పని మొఖం అయినాక గాదు, ఈ పని టైంలనే! నీ రొట్టిరిగి నేతిలో పడ్డది!" అని కోతిలా కిచకిచ నవ్విండు.

"నాకెందుకు? వద్దు. నేను కూలి పని మాత్రమే చేస్త!" అన్నది బెరుకున అడుగు కదుపుతూ.

"డబ్బు లోక విది. ఎంత ఉన్నోడూ ఉన్నది చాలదన్నట్టు నానా గడ్డీ గరుస్త డీ డబ్బుకోసం. ఇస్తనన్న డబ్బు వద్దంటవేంది? నీ దగ్గర డబ్బు మూల్గడంలేదు గద! ఉంటే ఈ పనికెందుకొస్తవు?" అని నవ్వి, "ఇగో, వందా పుచ్చుకో, నీ కూలీ పుచ్చుకో!" అని ఇంకొంచెం దగ్గరకొచ్చి, "ఇగో ... నీ పేరేదో అంటివే.... ఆఁ, భూదేవి గదూ! ఆఁ, భూదేవి!" అని, "అందరికీ ఇట్టాటి పిలుపు రాదు. ఇక్కడికొచ్చేటోళ్లలో ఎవరికొచ్చినా ఎగిరి గంతేస్తరు. ఆఁ!" అన్నాడు.

"నా కొద్దు! నా కొద్దు!" అని బాటన పడి వడిగా నడచింది.

'ఓర్నీ! ఇదేం విడ్డూరం! ఇట్టాంటోళ్లూ ఈ కాలాన ఉన్నారా?' అన్నట్లుగ చూసిండు ముసలి మేస్త్రీ.

ఓ క్షణమాగాక భూదేవిపైన చానా గొరవం మెదిలింది. 'మంచి పిల్ల' అని సణుక్కున్నాడు సంతోషంగా.

000

భూదేవి ఊర్కే ఉంటే ఇల్లు సజావుగా గడవదు. ఎటో అటు పనికైతే వెళ్లాలి. పని మొఖాన ఉన్న తరీఖా చూడబోతే...?

అట్టా అని పని మానుకోగలదా?

రాందాసు 'సారా మానితే, భూదేవి పనికెళ్లక్కరలేదు.

పోరినీ, ముసల్దాన్నీ చూసుకుంటూ ఉండొచ్చు.

కానీ రామదాసు తాగుడు మానతాడా?

ఈ దాసులు తాగుడు మానేస్తే, దీని రెవెన్యూతో బతికే మన ప్రభుత్వా లేమవుతాయి?

■

